క్లుప్తంగా

నేడు యాగంటి క్షేత్రంలో బహిరంగ వేలం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో పలు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు, తలనీలాలు, కొబ్బరి చిప్పల సేకరణ కోసం బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 10 గంటల్లోపు డిపాజిట్ చెల్లించి వేలాల్లో పాల్గొనవచ్చని ఈఓ పేర్కొన్నారు.

ఇల్లు మంజూరు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బాధితురాలు

బనగానపల్లె రూరల్: వర్షాలతో ఇల్లు కూలిపోయి రోడ్డున పడ్డామని.. తమకు ఇల్లు మంజూరు చేయించి ఆదుకోవాలని మండలంలోని హుస్సేనాపురం గ్రామానికి చెందిన మునెమ్మ తహసీల్దార్ నారాయణరెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఇంట్లోని సరుకులు, వస్తుసామగ్రి దెబ్బతిని తీవ్రంగా నష్టపోయానని ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి

బేతంచెర్ల: వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి గ్రామంలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు. వైద్యురాలు భార్గవి, ఎంఎల్‌హెచ్‌పీ విజయలక్ష్మి, ఏఎంఎం అమల ఉన్నారు.

అండర్ పాస్ బ్రిడ్జి పనులను ప్రారంభించాలి

డోన్ టౌన్: పట్టణంలోని కర్నూలు, నంద్యాల రైల్వేగేట్ల వద్ద అండర్ పాస్ బ్రిడ్జి పనులను వెంటనే ప్రారంభించాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఆ నాగరాజు కోరారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన ప్రజా పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మార్గంలో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారని.. రైల్వే గేట్ల కారణంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి అవసరమైన అండర్ పాస్ దిమ్మెలు తయారు చేశారని.. అనంతరం పనులు ఆగిపోయాయని పేర్కొన్నారు. పనులు ప్రారంభించి ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి బయటపడేలా చూడాలని కోరారు.

డెంగీ లక్షణాలతో ఆస్పత్రిలో చేరిక

ప్యాపిలి: పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన జయన్న, లక్ష్మీ కుమారుడు జయవరుణ్ (మూడున్నరేళ్లు) డెంగీ బారిన పడ్డాడు. కొద్ది రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న బాలుడిని తల్లిదండ్రులు స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ సందర్భంగా బాలుడికి రక్త పరీక్షలు నిర్వహించగా డెంగీ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. తల్లిదండ్రులు బాలుడిని కర్నూలులో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బాలుడు కోలుకుంటున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

రోడ్ల నిర్మాణానికి చర్యలు



పీఆర్ డీఈఈతో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: బనగానపల్లెలోని ఆస్థానం రోడ్డును రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం సాయంత్రం పరిశీలించారు. పాత ఆంధ్రా బ్యాంకు నుంచి ఆస్థానం సర్కిల్ వరకు ఉన్న రోడ్డు, డ్రైనేజీ అవస్తవ్యస్తంగా ఉందని, సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ.20 లక్షలు, డ్రైనేజీ నిర్మాణానికి రూ. 35 లక్షలు ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని పంచాయతీ రాజ్‌శాఖ అధికారులకు మంత్రి ఆదేశించారు. ఆయనతో పాటు పీఆర్ డీఈఈ నాగశ్రీనివాసులు ఉన్నారు.

ప్రభుత్వ తప్పిదమే

- వరద సహాయ చర్యలు చేపట్టడంలో విఫలం
- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి




డోన్: ''విజయవాడ వరదలను ముందే ఊహించిన ప్రభుత్వం ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం. బుడమేరు పరివాహక ప్రాంతాలతో పాటు క్యాచ్‌మెంట్ ఏరియాలో ఎంతమేరకు వర్షం పడుతుందనే విషయాన్ని తెలుసుకోవడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. అన్ని తెలిసి కూడా ప్రజలను అప్రమత్తం చేయకపోవడం టీడీపీ ప్రభుత్వం చేసిన చారిత్రాత్మక తప్పిదం. ప్రపంచంలోనే అత్యంత తెలివైన వాడినని, దార్శనికుడినని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు నాయుడు ప్రజలను వరదనీటి నుంచి కాపాడేందుకు కావాల్సిన రిలీఫ్ మెజర్‌మెంట్స్‌ను కూడా అందుబాటులో పెట్టుకోకపోవడం శోచనీయం. ఈ విషయంలో నాలుగు రోజులు కాలయాపన జరిగి ఆ తర్వాత బోట్లు, గజ ఈతగాళ్లు, హెలికాప్టర్లు, డ్రోన్లను తెప్పించడం వల్ల ప్రయోజనం లేకపోయింది. అప్పటికే జరగాల్సిన ప్రాణ, ఆస్తినష్టం జరిగిపోయింది. ప్రకాశం బ్యారేజీని బోట్లు ఢీకొనడం, బుడమేరు కాల్వ గట్టు తెగిపోవడం కుట్రకోణమని ప్రజలను తప్పుదోవ పట్టించి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఆడుతున్న నాటకమని ప్రజలు గ్రహించాలి. తన తప్పులను ఎప్పటిలాగానే ఇతరులపైకి నెట్టడం చంద్రబాబు నైజమని స్పష్టమైంది. చేసిన తప్పులను ఒప్పుకోకుండా ఇతరులపైకి నెట్టడం ఇకనైనా చంద్రబాబు మానుకోవాలి. ప్రజలకు కావాల్సిన నిత్యావసర వస్తువులు, సరుకులు సకాలంలో అందించి ఆదుకోవాలి. మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి తోడ్పడాలి. ఇలాంటి చారిత్రాత్మక పొరపాట్లు మరలా పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వాల్సింది పోయి గత ప్రభుత్వమం ఆరోపణలు చేస్తే ప్రజలే టీడీపీకి తగిన గుణపాఠం చెబుతారు''.



సంజామల: ఆకుమల్లలో గణనాథుని శోభాయాత్రలో సందడి చేస్తున్న యువకులు



డోన్ పాతబస్టాండ్ వద్ద అన్నదానం



డోన్ టీఆర్‌నగర్ ఆంజనేయస్వామి గుడి వద్ద..



బేతంచెర్ల: గోరుమానుకొండలో స్వామివారి సేవలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి



డోన్ తారకరామనగర్ గణపయ్యను దర్శించుకుంటున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ హరికిషన్

గంగమ్మ ఒడిలోకి గణనాథుడు

- ఘనంగా వినాయకుడి నిమజ్జన వేడుకలు
- అంబరాన్నంటిన సంబరం
- రంగులు చల్లుకుంటూ యువత కోలాహలం

కొలిమిగుండ్ల: గణపతి బొప్పా మోరియా.. జైజై గణేషా అంటూ సోమవారం గణనాథుల నిమజ్జన వేడుకలు కనుల పండువగా జరిగాయి. మండపాల్లో చవితి రోజు నుంచి మూడు రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లు, ఆటోల్లో కొలువుదీర్చారు. యువకుల కేరింతల నడుమ శోభా యాత్ర సాగింది. యువకులు రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఆయా గ్రామాల్లోని చెరువులు, కాలువల్లో వినాయకున్ని నిమజ్జనం చేశారు. కొలిమిగుండ్ల, కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె, బందార్లపల్లె, చింతలాయిపల్లె, గొర్విమానుపల్లె, బెలుం, ఇటిక్యాల, పెట్నికోట, నందిపాడు తదితర గ్రామాల్లో వేడుకగా నిమజ్జనం చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకున్నారు. బోలో గణపతి మహరాజ్‌కు జై అనే నినాదాలతో యువత హోరెత్తించారు. ఊరేగింపు సమయంలో యువకులు డప్పు వాయిద్యాలకు నృత్యం చేస్తూ ముందుకు కదిలారు. మండలంలో వినాయకులను నిమజ్జనం చేసేందుకు చాలా చోట్ల నీటి సమస్య ఎదురుకావడంతో ఎక్కువ భాగం విగ్రహాలను అవుకు సమీపంలోని రిజర్వాయర్‌కు తీసుకెళ్లారు. గ్రామాల్లో ఎక్కడా అల్లర్లు చోటు చేసుకోకుండా సీఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

-కోవెలకుంట్ల: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కోవెలకుంట్ల మండలంలోని ఆయా గ్రామాల్లో కొలువుదీరిన గణనాథుల నిమజ్జన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా 40 మండపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు చేశారు. నిమజ్జన సందర్భంగా విగ్రహాల ఊరేగింపులో డప్పు వాయిద్యాలు, యువకుల నృత్యాలు అలరించాయి. ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగియడంతో ప్రజలు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

పూజలందుకుంటున్న గణనాథులు

కోవెలకుంట్ల: పట్టణంలో పాండురంగస్వామి దేవాలయం, సంతమార్కెట్, రంగరాజుపేట, సభాపతిరోడ్, రామాలయం, కుమ్మరివీధి, పెద్దమ్మగుడి, గాంధీనగర్, బీఎస్ఎన్ఎల్ టవర్, బసిరెడ్డిబావి వీధి, దాసరివీధి, చిన్నబారం ఇమాం చావిడి, సంతపేట, ఎస్ఎల్‌వీటీ, గుద్దేటివీధి, చాకలిపేట, శ్రీవిద్యస్కూల్, నాగులకట్ట, కరెంట్ ఆఫీస్, సాయినగర్, సీతారాంనగర్, పాత పోస్టాఫీస్, సాయినగర్, పాతశివాలయం, ఏకలవ్యనగర్, అమ్మవారిశాల, గాంధీసెంటర్, సుంకులమ్మ వీధి తదితర ప్రాంతాల్లో 61 చోట్ల వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలను కొలువుంచారు.



కోవెలకుంట్ల: రంగులు చల్లుకుంటూ..

సోమవారం ఆయా కాలనీలకు చెందిన భక్తులు మండపాల వద్ద స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

సంజామల: మండలంలో వినాయకుడి శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. యువకులు వివిధ వేషధారణలు, నృత్యాలతో సందడి చేశారు. మండల వ్యాప్తంగా సుమారు 50 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

కోలాహలంగా నిమజ్జనోత్సవం

బేతంచెర్ల: మండలంలో వినాయకుని నిమజ్జన వేడుకలు అంబరాన్నంటాయి. మండలంలోని ఆర్ఎస్ రంగాపురం, సిమెంట్ నగర్, శంకలాపురం, సీతారామపురం, ముద్దవరం, ముసలాయిచెర్వు, బుగ్గానిపల్లె, బలపాలపల్లె గ్రామాల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. బాణా సంచా కాలుస్తూ గణపతి బప్పా మోరియా అంటూ బొజ్జ గణపయ్యలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. గోరుమానుకొండలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.



డోన్ వెంకటాపురం చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న యువకులు



బనగానపల్లెలో..



కొలిమిగుండ్ల: నిమజ్జనానికి తరలిపోతున్న వినాయకుడు

కొనసాగుతున్న వినాయక ఉత్సవాలు

డోన్/ డోన్ టౌన్: వినాయక చవితి ఉత్సవాలు డోన్‌లో ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజు సోమవారం స్వామి వారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి మంగళ హారతులు ఇచ్చారు. మధ్యాహ్నం మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా డోన్ పట్టణంలో ఈ ఏడాది నిమజ్జనం గందరగోళానికి దారి తీసింది. గణేష్ ఉత్సవ కమిటీ మండప నిర్వాహకుల మధ్య సమాచార లోపంతో కొందరు మూడు రోజులు, మరికొందరు ఐదు రోజులకు నిమజ్జనం నిర్వహిస్తున్నారు. ఏటా మూడురోజుల పాటు నిర్వహించే గణేష్ ఉత్సవాలను ఈ ఏడాది ఐదు రోజుల పాటు జరుపుకునేందుకు పోలీసులు అనుమతించారని అకస్మాత్తుగా ఉత్సవ కమిటీ ప్రకటించడంతో ఈ పరిస్థితి నెలకొంది. కొందరు ముందు అనుకున్న విధంగా మూడో రోజు స్థానిక వెంకటాపురం చెరువులో వినాయక నిమజ్జనాన్ని చేశారు. స్థానిక టీఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ ప్రత్యేక పూజలు చేశారు.



కోవెలకుంట్ల: నాగులకట్టలో..



బేతంచెర్లలో..



కొలిమిగుండ్ల: ఊరేగింపుగా వెళుతున్న భారీ గణనాథుడు



కొలిమిగుండ్లలో..



కొలిమిగుండ్ల: ఊరేగింపులో నృత్యం చేస్తూ..

విద్యారంగ సమస్యలపై వినతి

కోవెలకుంట్ల: రాష్ట్రంలోని విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ అన్నారు. ఈ మేరకు సోమవారం కడప ఆర్‌జేయూపీ భవన్‌లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 117 జీఓను రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో విలీనమైన 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు నెలవారీ పదోన్నతులు ఇవ్వాలని, డైట్, బీఈడీ కళాశాలల్లో నియామకాలు చేపట్టి శిక్షణా సంస్థలను బలోపేతం చేయాలని కోరారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాసులు, ముత్తోజ్ వీరబ్రహ్మం, శ్రీనివాసరెడ్డి, కన్నయ్య, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌జేయూపీ నాయకులు

మురుగు పారదు.. సమస్య తీరదు

డోన్: మండలంలోని యాపదిన్నె గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి బురదమయంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రతి శనివారం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి భక్తులు వస్తుంటారు. రోడ్డు మొత్తం మురుగు నీటితో నిండిపోతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పైభాగంలోని గృహాల నుంచి మురుగునీరు ప్రధాన రహదారిపై చేరడంతో ఈ దుస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం డ్రైనేజీ కాలువలు నిర్మించడంతో పాటు పక్కన ఉన్న పొలాల యజమానులను పిలిచి కాల్వలను తవ్వే ఏర్పాట్లయినా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



యాపదిన్నెలో రోడ్డుపై నిలిచిపోయిన మురుగు

పందులతో అపరిశుభ్రత

కొలిమిగుండ్ల: జనవాసాల్లో పందులు గుంపులుగా సంచరిస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోకి వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొలిమిగుండ్లలో ఎక్కడ చూసినా గుంపులుగా దర్శనమిస్తున్నాయి. మోడల్ స్కూల్ ఆవరణలోకి చేరుతున్నాయి. ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోకి వెళ్లి విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసే సమయంలో తిరుగుతూ విద్యార్థులు పడేసే భోజనాన్ని తింటున్నాయి. ప్రధాన రహదారిలో సంచరిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చుట్టు పక్కల పొలాల్లోకి చేరి పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. అధికారులు స్పందించి పందుల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సంచరిస్తున్న పందులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని ఇందిరానగర్, కంబాలపాడు రోడ్డు, తారకరామనగర్ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో 11 కేవీ పనుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యంబాయి లడ్డూ రూ.80 వేలు

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామంలో సోమవారం వినాయకుని లడ్డూకు వేలం పాట నిర్వహించారు. యంబాయి గ్రామానికి చెందిన నడిపి సిద్దయ్య రూ.80 వేలకు దక్కించుకున్నారు. అదే గ్రామానికి చెందిన పెద్ద సిద్ధయ్య కలశం టెంకాయను రూ.37,500కు దక్కించుకున్నారు. ఈ నగదుతో వచ్చే ఏడాది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్యాపిలి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్ అన్నారు. స్థానిక బీసీ కాలనీలో సోమవారం పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి తొట్టెలు, పాత టైర్లు, మురుగు కాలువల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణతోనే వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. దోమ తెరలు వినియోగించాలన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

డోన్ టౌన్: ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రతి సోమవారం ప్రజా పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగమణి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీలను ఎప్పటికప్పుడు విచారణ చేసి తగిన పరిష్కారం చూపాలని ఆయా శాఖల మండల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టు మృతి

డోన్ రూరల్: ట్రాక్టర్ ఢీకొనడంతో స్కూటరిస్టు మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి డోన్ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామం వద్ద చోటుచేసుకుంది. వెంకటాపురం గ్రామానికి చెందిన బోయ శివ(23) సోమవారం రాత్రి అబ్బిరెడ్డిపల్లె గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. స్నేహితుడు ధనుంజయతో కలిసి ద్విచక్రవాహనంపై తిరిగి వెంకటాపురం గ్రామానికి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. ధనుంజయ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పెట్టుబడి సాయం ఏదీ?

బనగానపల్లె రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేలను వెంటనే విడుదల చేయాలని ఏపీ రైతు జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారాయుడు కోరారు. సోమవారం మండలంలోని చెరువుపల్లె, నందవరం సచివాయాల్లో రైతులతో కలిసి వినతి పత్రాలు అందజేశారు. ప్రభుత్వం వ్యవసాయ మీటర్లకు బిగించాలని ఇచ్చిన జీఓ 22ను రద్దు చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులను భూమి యజమానితో సంబంధం లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు, బాలశేఖర్, ఖాజాహుస్సేన్, బాలాజీ, దస్తగిరి, వలి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వరద బాధితులకు నిత్యావసర కిట్లు

డోన్ టౌన్: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సామాజిక బాధ్యతగా డోన్‌కు చెందిన స్ఫూర్తి సేవా సంస్థ నడుం బిగించింది. దాతల ఆర్థిక సహకారంతో సేకరించిన వాటితో బియ్యం, పది రకాల నిత్యావసర సరుకులతో సుమారు 300 కిట్లను సిద్ధం చేసింది. సోమవారం విజయవాడకు పంపించారు. ఈ వాహనాన్ని తహసీల్దార్ నాగమణి, డీఎస్పీ శ్రీనివాసులు, పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా జెండా ఊపి ప్రారంభించారు.

డీఎస్పీ ఆర్థిక సహాయం

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు నిత్యావసర సరుకులతో వెళుతున్న ప్రత్యేక వాహనాన్ని ప్రారంభించేందుకు వచ్చిన డీఎస్పీ శ్రీనివాసులు స్పందించి తన వంతు సహాయంగా రూ.10వేల నగదును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా స్ఫూర్తి సంస్థ వ్యవస్థాపకుడు సీసంగుంతల మధు మాట్లాడుతూ.. వరద బాధితుల సహాయార్థం పట్టణ, గ్రామీణ ప్రజలతో పాటు ఆన్‌లైన్‌లో సహాయం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్థిక సహాయం చేస్తున్న డీఎస్పీ

గర్భిణులకు అన్నదానం

బేతంచెర్ల: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం అన్నదానం చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, గర్భిణులు, వృద్ధులకు అన్నం వడ్డించారు. ప్రతి ఒక్కరూ సేవాభావం అలవచ్చుకోవాలని సూచించారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రాజు, సభ్యులు మనోహర్ రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేద్దాం

బేతంచెర్ల: రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25, 26 తేదీల్లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట తలపెట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో టీడీపీ, బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు చిన్న తిమ్మయ్య, బాలశేఖర్, మద్దయ్య, రాముడు పాల్గొన్నారు.

రమణీయం.. ఉమామహేశ్వరుని పలకోత్సవం



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి పల్లకీ సేవ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలోని ఉమామహేశ్వర స్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.